కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట రూ. 15, పచ్చిమిర్చి 50, బెండ 60, కాకర 60, దొండ 60, దోస 40, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్‌ 60, బీట్‌రూట్‌ 40, క్యాప్సికం 40, క్యాబేజీ 20, క్యారెట్‌ 40, చిక్కుడు 60, ఉల్లి 35(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్‌ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 180.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


శిబిరాన్ని పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్‌

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్‌ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌ మధురానగర్‌లో శ్రీకృష్ణయూత్‌ అసోసియేషన్‌, కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయవచ్చన్నారు. శ్రీకృష్ణయూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువజన కాంగ్రెస్‌ నాయకుడు అభిషేక్‌గౌడ్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్‌, యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు, స్థానికులు శశాంక్‌రావు, అశోక్‌గౌడ్‌, వెంకట్‌గౌడ్‌, నర్సింగ్‌రావు, ముర్తుజా, గోపాల్‌, సంఘమేష్‌, నర్సింహ, దేవేందర్‌, కిరణ్‌, శివ, లడ్డూ, సాయినాథ్‌, నవీన్‌, దిలీప్‌, చిన్నా, సాయి, గిరి, రాకేశ్‌, రవి పాల్గొన్నారు.

పాఠశాలలో రక్తదాన శిబిరం



మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని శ్రీ వివేకానంద కాన్వెంట్‌ హైస్కూల్‌లో అశ్వ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100కి పైగా యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్‌ ధన దుర్గ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తలసీమియా పిల్లల కోసం 14 సంవత్సరాలుగా రక్తదాన శిబిరం ద్వారా రక్తాన్ని సేకరించి అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వలంటీర్లు ధనేశ్‌, తన్మయ, వెంకటేష్‌, వినయ్‌, భార్గవి, పద్మజ, లోకేశ్వరి, దుర్గాప్రసాద్‌, మనికుమార్‌, నాగరాజు, సంతోష్‌, నరేష్‌ రాజు, శివ ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

మణికొండ: అనారోగ్యంతో కొంత కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఓ వ్యక్తి ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని హైదర్‌షాకోట్‌, హిమగిరినగర్‌ కాలనీలో ఆదివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చి హైదర్‌షాకోట్‌లో స్థిరపడిన రాజు(50) కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు ఆస్పత్రులలో చికిత్స తీసుకున్న నయం కాకపోవటం, మరింత పెరిగిపోతుండటంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వడ్డెర కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి

రాజేంద్రనగర్: వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించి... సంఘాన్ని అభివృద్ధి చేస్తానని శ్రీ వెంకటేశ్వర వడ్డెర సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వేముల శ్రీనివాస తెలిపారు. రాజేంద్రనగర్‌ వడ్డెర సంఘం సభ్యులు వేముల శ్రీనివాసని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస మాట్లాడుతూ... తనపై నమ్మకంతో వడ్డెర సంఘం బాధ్యతలు అప్పగించిన వడ్డెర సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘంలో ఉన్న ప్రతి సభ్యుడు సంఘం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఉపాధ్యక్షులు దండుగుల శ్రీనివాస, వినోద్‌, జనరల్‌ సెక్రటరీ గుంజ రాజు, కోశాధికారి రవి, ఆర్గనైజర్‌ శ్రీను, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): రామచంద్రాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన రామాలయం, శివాలయం సరస్వతీదేవి ఆలయంతో పాటు జంట నాగులు ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు కార్పొరేటర్‌ పుష్ప ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొల్లారం మున్సిపల్‌ మాజీ కౌన్సిలర్‌ చంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులను కార్పొరేటర్‌ దంపతులు ఘనంగా సన్మానించారు. బొల్లారం మున్సిపల్‌ నాయకులు పాల్గొన్నారు.


గోపన్‌పల్లితండాలో నిర్మించిన ఫ్లైఓవర్‌

ప్రగతిపథంలో గోపన్‌పల్లితండా..!


గోపన్‌పల్లితండా నుంచి గోపన్‌పల్లి వరకు విస్తరించిన రోడ్డు

ఫ్లైఓవర్‌, ప్రధానరోడ్డు, కూడళ్ల విస్తరణ • బహుళ అంతస్తులతో కనువిందు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లితండా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌కు చేరువగా, మరోవైపు విప్రో, టీఐఎఫ్‌ఆర్‌ సంస్థలు ఉండగా అందుకనుగుణంగా రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్‌ నిర్మించడంతో రూపురేఖలే మారిపోతున్నాయి. ఒకప్పుడు చిన్నచిన్న ఇళ్లు మాత్రమే ఉండే గోపన్‌పల్లితండా గత ఆరేళ్లలోనే బహుళ అంతస్తుల భవనాలతో పట్టణాన్ని తలపిస్తున్నది.


గోపన్‌పల్లితండా నుంచి ఓఆర్‌ఆర్‌ వరకు విస్తరించిన ప్రధాన రోడ్డు

రూ.103.30 కోట్లతో రోడ్డు విస్తరణ..

గోపన్‌పల్లితండా కూడలి నుంచి కొల్లూరు మీదుగా ఔటర్‌ రింగురోడ్డు వరకు ఉన్న 7.78 కిలోమీటర్ల ప్రధాన రోడ్డును రూ.103.30 కోట్లతో విస్తరించారు. ఈ మొత్తం రోడ్డులో రంగారెడ్డి జిల్లా పరిధిలో 1.6 కిలోమీటర్ల రోడ్డు ఉండగా మిగతాది ఉమ్మడి మెదక్‌ జిల్లాలో ఉంది. ఈ రోడ్డును రేడియల్‌ రోడ్డు–30 ఎక్స్‌టెన్షన్‌ రోడ్డుగా పిలుస్తారు. అదేతరహాలో గోపన్‌పల్లి నుంచి గోపన్‌పల్లితండా మీదుగా వట్టినాగుల పల్లి వరకు ఉన్న రోడ్డును కూడా విస్తరించారు.


గోపన్‌పల్లితండా

రూ.30 కోట్లతో ఫ్లైఓవర్‌ నిర్మాణం..

గోపన్‌పల్లితండాలో ‘టీ’ ఆకారంలో రూ.30 కోట్లతో ఫ్లైఓవర్‌ నిర్మించారు. దీంతో మూడు వైపులా దాదాపుగా ట్రాఫిక్‌ ఇక్కట్లు తీరినట్లయ్యింది.

విప్రో, టీఐఎఫ్‌ఆర్‌, త్వరలో విప్రో విస్తరణ..

గోపన్‌పల్లితండా చెంతనే ఉన్న విప్రో ఐటీ సంస్థ తన రెండో కేంద్రాన్ని నానక్‌రాంగూడ విప్రో సర్కిల్‌ తర్వాత మరొకదాన్ని తండా చెంతనే ఉన్న ఎన్టీఆర్‌కాలనీ వద్ద ఏర్పాటు చేసింది. అదేవిధంగా 200 ఎకరాల స్థలంలో టాటా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఫండమెంటల్‌ రీసెర్చ్‌ (టీఐఎఫ్‌ఆర్‌)ను ఏర్పాటు చేశారు. తాజాగా విప్రో సంస్థను మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. ఇది కూడా అందుబాటులోకి వస్తే మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుంది.

మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలి

మియాపూర్: మహిళలు అన్ని వేళల మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని సంఘమిత్ర విజయలక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మియాపూర్‌ మయూరినగర్‌ కాలనీలోని దివ్య శ్రీ శక్తి అపార్ట్‌మెంట్‌లో హౌస్‌కీపింగ్‌ మహిళలకు భరోసా, సఖీ, షీ–టీమ్స్‌ తదితర సహాయ బృందాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మహిళలు ఎలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. గృహహింస, సైబర్‌ నేరాల్లో సహాయం అందించేందుకు తెలంగాణ పోలీస్‌, ఎస్‌సీఎస్‌సీ సంయుక్తంగా రూపొందించిన భరోసా, సఖీ, షీ–టీమ్స్‌ అందుబాటులో ఉంటాయన్నారు. ఎలాంటి సమస్యలైనా ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. సమీప సంఘ మిత్రులను సంప్రదించి సరైనా మార్గ నిర్దేశాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యేలు కృష్ణారావు, గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం రాందేవ్‌రావ్‌ ఆసుపత్రి ఆధ్వర్యంలో జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఉచిత మెగా హెల్త్‌ క్యాంప్‌ నిర్వహించారు. క్యాంప్‌నకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. రాందేవ్‌రావ్‌ ఆసుపత్రి మరింత మంది పేదలకు ఉపయోగపడాలని కోరారు. కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ పాల్గొని డయాబెటిక్‌, న్యూరోపతి, ఫుట్‌ హెల్త్‌ కేర్‌ పొడియటరీ, ఎముకల సాంద్రతను కనుగొనే న్యూట్రిషన్‌ విభాగాన్ని ప్రారంభించారు. టీయూడబ్ల్యూజే అధ్యక్షులు విరహత్‌ అలీ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఫైబ్రోస్కాన్‌ని ప్రారంభించారు. ఈ క్యాంప్‌ విక్రందేవ్‌రావు, మీరారావ్‌, ప్రశాంత్‌ రెడ్డి, అపర్ణరావ్‌, ఆసుపత్రి మెడికల్‌ డైరెక్టర్‌ కమలాకర్‌ ఆధ్వర్యంలో జరిగింది. బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సీఈఓ యోబు, ప్రముఖ రేకీ థెరపీ గ్రాండ్‌ మాస్టర్‌ శ్రీలక్ష్మీ కమలాకర్‌ పాల్గొన్నారు.


కేన్సర్‌ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ తదితరులు


కంటి పరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

క్రీడలను ప్రోత్సహిద్దాం

బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్‌ నియోజకవర్గంలో మంచి క్రీడాకారులు ఉన్నారని, వారందరినీ ప్రోత్సహించేలా టోర్నమెంట్‌లు నిర్వహిద్దామని బీఆర్‌ఎస్‌ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌ పార్టీ ఉపాధ్యక్షుడు బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ పుట్టినరోజున ప్రారంభించిన కేసీఆర్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ విజేతలకు ఆయన ఆదివారం మణికొండలో ట్రోఫీలు, చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో క్రికెట్‌, వాలీబాల్‌, బ్యాడ్మింటన్‌, రెజ్లింగ్‌, కబడ్డీ, ఖోఖో, బాక్సింగ్‌ తదితర క్రీడలలో రాణించిన ఎందరో క్రీడాకారులు ఉన్నారన్నారు. వారందరినీ మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అందుకు అనుగుణంగా రాబోయే రోజుల్లో ఇలాంటి టోర్నమెంట్‌లను మరిన్ని నిర్వహిద్దామన్నారు.

విజేతలు వీరే...

కేసీఆర్‌ క్రికెట్‌ టోర్నీలో శ్రీకాంత్‌ సారథ్యంలోని ఆల్ఫా 11 టీం మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీతోపాటు రూ. 75 వేల నగదు బహుమతి, అజయ్‌ సారథ్యంలోని ఆరోలియో అవెంజర్స్‌ టీం రెండవ స్థానంలో నిలిచి రూ. 50 వేలు, రమేష్‌ సారథ్యంలోని జైహనుమాన్‌ టీం మూడవ స్థానంలో నిలిచి రూ. 25 వేల నగదు పురస్కారాలను అందుకున్నారు. బెస్ట్‌ ప్లేయర్‌గా దీపక్‌సింగ్‌, బెస్ట్‌ బ్యాట్స్‌మెన్‌గా రమేష్‌సింగ్‌, బెస్ట్‌ బౌలర్‌గా మనోజ్‌, బెస్ట్‌ ఫీల్డర్‌గా రఘు నిలవటంతో వారికి మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పార్టీ మణికొండ మున్సిపల్‌ అధ్యక్షుడు డి. సీతారాం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్‌, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. ధన్‌రాజ్‌, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించిన ఉపేంద్రనాథ్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

డంపింగ్‌ యార్డు ఏర్పాటును విరమించుకోండి

బీఆర్‌ఎస్‌ నాయకుడు గోవర్ధన్‌ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి సమీపంలోని పారానగర్‌ గ్రామవద్ద ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌ యార్డుకు వ్యతిరేక ఆందోళనలు ఆదివారం 33వ రోజుకు చేరాయి. డంపింగ్‌ యార్డు ఏర్పాటును రద్దు చేసే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షను సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నష్టం కలిగించేలా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని అన్నారు. ప్రజారోగ్యం, రైతన్నల నష్టాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. జేఏసీ పిలుపు మేరకు కార్యాచరణ మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సీజీఆర్‌ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోవర్ధన్‌ రెడ్డి

దోమల నివారణ మందు పిచికారీ

మియాపూర్: గురునాథం చెరువు తరహాలో మియాపూర్‌లోని అన్ని చెరువులను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ అన్నారు. ఆదివారం డివిజన్‌ పరిధిలోని పటేల్‌ చెరువులో డ్రోన్‌ సహాయంతో దోమల నివారణకు చేపట్టిన పనులను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పటేల్‌ చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రమైందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో డ్రోన్‌తో దోమల మందు పిచికారీ చేయించారు. త్వరలోనే పటేల్‌ చెరువులోనూ మల్లిగావాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రమావత్‌ చిన్న, రహీం, దశరథ్‌, రాజేష్‌, డివిజన్‌ మహిళా అధ్యక్షురాలు సుప్రజ, చంద్రకళ, నాయకులు చందు, శ్రీనివాస్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న నేతలు

చందానగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హఫీజ్‌పేట్‌ డివిజన్‌ వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక ముస్లిం నేతలు మహ్మద్‌ హమీద్‌ షరీఫ్‌, ఎండీ మోసిన్‌, అక్బర్‌, ప్రభాకర్‌, వసీం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు లేనిదే జీవనం లేదన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది మహేష్‌, నాగేషప్ప, యాదయ్య, నారాయణ స్వామి, నాగరాజు, వినయ్‌, మహేష్‌ గౌడ్‌, జితేందర్‌ నాయక్‌, వెంకన్న, అచ్యుత్‌, దేవేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్‌: మాజీ మంత్రి హరీష్‌ రావును ఆదివారం బీఆర్‌ఎస్‌ మహిళా నేతలు తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మార్చి 11న కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌యాదవ్‌ ఆధ్వర్యంలో నిర్వహించబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మెట్టు రమా, భారతినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సింధు, బీఆర్‌ఎస్‌ మహిళా నేతలు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్‌ డాక్టర్‌ రవికుమార్‌ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి అందుబాటులో ఉంటుందన్నారు. సర్కిల్‌ పరిధిలోని ఐదు డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికితీసుకురావాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతారని... అక్కడికక్కడే సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని వెల్లడించారు.

క్రీడలతో మానసిక వికాసం

పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ


క్రికెట్‌ ప్రీమియర్‌ లీగ్‌ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్: క్రీడలు చిన్నారుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీయడమేగాక మానసిక వికాసానికి దోహదం చేస్తాయని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. ఆదివారం మాదాపూర్‌ డివిజన్‌, మాతృశ్రీనగర్‌ కాలనీలో క్రికెట్‌ ప్రీమియర్‌ లీగ్‌ సీజన్‌–8 నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రికెట్‌ ప్రీమియర్‌ లీగ్‌ నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో ముఖ్యమని, క్రీడలతో శారీరక దారుఢ్యం పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, చదువులతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం క్రికెట్‌ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అనిల్‌ కావూరి, అవంతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ పీడీఎస్‌యూ అధ్యక్షుడిగా నాగరాజు



రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో ఆదివారం పీడీఎస్‌యూ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు, ఉద్యమాల నిర్వహణపై సమీక్షించారు. అనంతరం హెచ్‌సీయూ పీడీఎస్‌యూ శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా భీంసేన్‌, కన్వీనర్‌గా సందీప్‌, ఉపాధ్యక్షులుగా రాము, బాలరాజు, సంయుక్త కార్యదర్శులుగా అనిల్‌, రాము, కోశాధికారి బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా అంకుర్‌, సంపత్‌, రోహిత్‌, వరుణ్‌, శివ, అప్పలకొండ, నితీన్‌ను నియమించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు. భవిష్యత్తు కార్యక్రమాల కార్యాచరణను రూపొందించి ముందుకుసాగుతామన్నారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బెంగళూరుకు చెందిన ప్రముఖ ఒడిస్సీ గురువు డాక్టర్‌ మనసి పాండ్య రఘునందన్‌ శిష్యురాలు సంహితతో కలిసి ఒడిసి నృత్య ప్రదర్శనలో పంచదేవీకృతి, పల్లవి, బాబు, దుర్గ, మోక్షం అంశాలను ప్రదర్శించి అలరించారు. వైదేహి సుభాష్‌ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనలో సకలగణాధిప, పుష్పాంజలి, నటేశకౌతం, పిబరేరామరసం, కీర్తన, తిల్లాన, తదితర అంశాలను కళాకారులు మనస్విని, మోక్షిత, మీనాక్షి, పావిక, నిహారిక, అవిజ్ఞ, హరిణి, కార్తిక తదితరులు ప్రదర్శించారు.


నృత్యం చేస్తున్న కళాకారులు



సీఐటీయూతోనే కార్మికులకు న్యాయం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్‌: కార్మికుల కష్ట సుఖాల్లో ఎర్రజెండా అండగా ఉంటుందని, సీఐటీయూ అంటేనే కార్మికులకు ఒక భరోసా అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, కిర్బీ యూనియన్‌ అధ్యక్షుడు చుక్కా రాములు పేర్కొన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు సీఐటీయూలో చుక్కా రాములు సమక్షంలో పెద్ద ఎత్తున చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కార్మికులకు అండగా సీఐటీయూ ఉంటుందన్నారు. కిర్బీ పరిశ్రమలో కూడా కార్మికులకు అనేక చట్టపరమైన సౌకర్యాలు సీఐటీయూ సాధించిందని, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు సాధిస్తామని భరోసానిచ్చారు. కార్మికులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.రాజయ్య, యూనియన్‌ నాయకులు రాజు, శ్రీనివాస్‌, మల్లేశ్‌, లక్కన్‌ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలు ఉన్నత ప్రమాణాలతో విద్యనందించాలి

హయ్యర్‌ ఎడ్యుకేషన్‌ కౌన్సిల్‌ చైర్మన్‌, ప్రొఫెసర్‌ వి. బాలకిష్టారెడ్డి

కూకట్‌పల్లి: వర్సిటీలు ఉన్నత ప్రమాణాలతో విద్యనందించాలని తెలంగాణ హయ్యర్‌ ఎడ్యుకేషన్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ ప్రొఫెసర్‌ వి. బాలకిష్టారెడ్డి అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి వై జంక్షన్‌ వద్ద ఎంఎస్‌ఆర్‌ యూనివర్సిటీ సెంట్రల్‌ అడ్మిషన్‌ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌కు అధిక జనాభా భారం కానే కాదనీ, యువ శక్తి కాళ్లమీద నిలబడేలా విద్యా వ్యవస్థను పటిష్ఠం చేస్తే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. కొవిడ్‌ విద్యా వ్యవస్థను ప్రభావితం చేసిందని, అది విసిరిన సవాళ్లను ఎదుర్కొనేలా సిలబస్‌ రూపొందించాలని ఆయన విద్యా సంస్థలకు సూచించారు. ఇంటర్‌ డిసిప్లినరీ విధానానికి టెక్నాలజీని అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. ఎంఎస్‌ఆర్‌ వ్యవస్థాపకుడు ఎంఎస్‌ రాజు 50 ఏళ్ల విద్యా ప్రస్థానంపై రూపొందించిన స్ఫూర్తిదాయకమైన డాక్యుమెంటరీని బాలకిష్టారెడ్డి అభినందించారు. అనంతరం యూనివర్సిటీ బ్రోచర్‌ విడుదల చేసి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


మహిళలను సన్మానిస్తున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: మహిళలు ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పీఏసీ చైర్మన్‌ గాంధీ, ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీ డివిజన్‌ కాలనీ ఫేజ్‌ 2లోని ఎంఎల్‌ఎన్‌ గార్డెన్స్‌లో ఆదివారం కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను ఎంబీసీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ జెరిపేటి జైపాల్‌, వియాట్రిస్‌ భారత సీఎస్‌ఆర్‌, పరిపాలన సేవల అధిపతి మిషెల్‌ డోమినికతో కలిసి సన్మానించారు. కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌, నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్‌ పారిశుద్ధ్య కార్మికుల కాళ్లను కడిగారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. మహిళలు ఎదుగుతూ ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. స్త్రీ లేనిదే సమాజం లేదన్నారు. ప్రతి ఒక్కరూ వారిని గౌరవించాలన్నారు.